క్లుప్తంగా

పోలీసుల అదుపులో కైలే శివకుమార్ దంపతులు

గన్నవరం: గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ఆదివారం మరో ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం జరిగిన దాడి కేసులో ముస్తాబాద మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి(ఏ–28), ఆమె భర్త పార్టీ నేత కైలే శివకుమార్‌ను(ఏ–27)గా నిందితుల జాబితాలో పోలీసులు చేర్చారు. ఇటీవల వీరికి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. దీంతో వీరిపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు విజయవాడ రూరల్ మండలం నున్నలోని హైవే బైపాస్ వద్ద వీరిని సీఐ శివప్రసాద్ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శివకుమార్, ఆదిలక్ష్మి దంపతులను గన్నవరం పీఎస్‌కు తరలించి అక్కడ సీఐడీ అధికారులకు అప్పగించడంతో తాడేపల్లి సీఐడీ ఆఫీస్‌కు తరలించారు. వీరిద్దరిని సోమవారం రిమాండ్ నిమిత్తం విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: పోరంకి శ్రీనగర్‌కాలనీలోని శ్రీకోదండ రామాలయం పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. శ్రీనగర్‌కాలనీలో రామాలయం నిర్మించాలని స్థానికులు ముందుకు వచ్చి గుడి నిర్మాణం చేపట్టారు. ప్రయోగరాజ్ కుంభమేళా నుంచి త్రివేణి సంగమం జలాలు తీసుకొచ్చి జలాన్ని భక్తులందరిపై సంప్రోక్షణ చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రామాలయ కమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి, అనుమోలు ప్రభాకరరావు, అంకెం రాజేష్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ప్రజారోగ్య పరిరక్షణ



కంకిపాడు: దోమల నిర్మూలనతో ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు సూచించారు. పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది సంయుక్త ఆధ్వర్యాన దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా కంకిపాడు పట్టణంలో ఆదివారం ఫాగింగ్ పనులు చేశారు. డ్రెయిన్లు, అంతర్గత రహదారుల్లో ఫాగింగ్ చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రెయిన్లలో వ్యర్థాలు వేయొద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తి అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వాకింగ్ ట్రాక్ మరమ్మతులు



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వాకింగ్ ట్రాక్ మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో వేసిన ట్రాక్‌పై ఎర్ర రబ్బీస్ కారణంగా పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలను గుర్తించిన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ దాతల సహకారంతో సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. ట్రాక్‌పై నడిచేందుకు పట్టునివ్వడానికి కొంత మేర పొడి, గరుకుగా ఉండే ఫ్లైయాష్‌ను ఆరు ట్రక్కులు చల్లించారు. అనంతరం పూర్తిస్థాయిలో ట్రాక్‌ను రోలింగ్ చేయించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కిషోర్ తెలిపారు. క్రీడా ప్రాంగణంలో వాకర్స్ సౌకర్యార్థం టాయిలెట్స్, బోర్‌వెల్ పనులు కూడా చేపట్టనున్నట్లు వివరించారు.

వైభవంగా కనకదుర్గమ్మ జాతర



కంకిపాడు: మద్దూరు గ్రామ శివారు కనకదుర్గాపురంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ జాతర మహోత్సవం వైభవంగా సాగింది. శనివారం రాత్రి గ్రామ కూడలిలో వేంచేసిన అమ్మవారికి భక్తులు డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ, వీర నాట్యం చేస్తూ పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభ బండిని భక్తులు ఆదివారం గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మ్యుటేషన్ మాయ

- ఆస్తిపన్ను పేరు మార్పులో నిబంధనలకు తూట్లు
- మాన్యువల్ రశీదులు జారీ
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్
- విచారణ చేపట్టిన మున్సిపల్‌శాఖ



ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం (ఇన్‌సెట్) మాన్యువల్ రశీదు

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో మ్యుటేషన్ మాయాజాలం నడుస్తోంది. ఆస్తిపన్ను పేరు మార్పు దరఖాస్తును అదునుగా చేసుకుని జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చట్టాలకు తూట్లు పొడుస్తూ మాన్యువల్ రశీదులు జారీ చేసిన ఉదంతం కార్యాలయ అధికారుల పీకకు చుట్టుకుంది. మ్యుటేషన్ గందరగోళంపై ఏకంగా మున్సిపల్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి కన్నబాబు సుమారు 15 రోజుల క్రితం విచారణకు ఆదేశించడంతో ఉద్యోగ వర్గాల్లో భయం నెలకొంది.

ఆస్తిపన్ను పేరు మార్పులో ఇష్టారాజ్యం

ఉయ్యూరు పట్టణంలో 20 వార్డులు ఉన్నాయి. 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. 10 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. ఉయ్యూరు మున్సిపాలిటీలో ఆస్తిపన్ను పేరుమార్పులో రెవెన్యూ విభాగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. మ్యుటేషన్ (ఆస్తిపన్ను పేరు మార్పు) విషయంలో 30 మందికి పైగా మాన్యువల్ రశీదులు ఇచ్చి పేరు మార్చేసినట్లు నగదు వసూళ్లు చేశారు. ఆస్తుల యజమాని పేరు మార్చే ప్రక్రియలో మార్కెట్ విలువలో ఒక శాతం పన్ను వసూలు చేస్తారు. పొలాలు, భవనాలు కొనుగోలు చేసినవారు దరఖాస్తు చేసుకోవడమే అదనుగా మున్సిపల్ అధికారులు చేతివాటం చూపుతున్నారు. తక్కువ ధరకే మార్చేసి లబ్ధి చేకూర్స్తామని ఆశ చూపి ఎడాపెడా రశీదులు జారీ చేస్తున్నారు. ఆస్తి పన్ను పేరు మార్పుతో పాటు ఏ పన్నులు చెల్లించినా సరే సంబంధిత దరఖాస్తుదారులు, యజమానులకు ఆన్‌లైన్‌లో మాత్రమే రశీదులు ఇవ్వాలి. ఇందుకు విరుద్ధంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు 30 మందికి పైగా యజమానులకు మాన్యువల్ రశీదులు ఇచ్చి అవకతవకలకు పాల్పడ్డారు.

రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

మాన్యువల్ రశీదుల వ్యవహారం సుమారు నెల రోజుల క్రితం వెలుగుచూసింది. దీంతో అధికారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘుబాబుపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. మ్యుటేషన్ వ్యవహారం మున్సిపాల్టీలో మరికొందరి మెడలకు చుట్టుకోనుండటంతో ఆర్ఐపై చర్యలు తీసుకుని మభ్యపెట్టాలనే తంతుకు పూనుకున్నారు.

గుడివాడ కమిషనర్ నేతృత్వంలో విచారణ

మ్యుటేషన్ మాయాజాలంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఆధారాలతో సహా జనవరిలో మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి కన్నబాబుకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఫిబ్రవరిలో విచారణకు ఆదేశించారు. ఆ శాఖ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు.. గుడివాడ మున్సిపల్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. మ్యుటేషన్‌లో మాన్యువల్ రశీదులపై విచారణ సాగుతోంది.

ఆర్ఐపై చర్యలు తీసుకున్నాం



మ్యుటేషన్ విషయంలో మాన్యువల్ రశీదులు ఇవ్వడంపై ఆర్ఐ రఘుబాబుపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులను కోరా. నా ప్రమేయం లేకుండానే మాన్యువల్ రశీదులు జారీ అయ్యాయి. నివేదిక ఆధారంగానే ఆర్ఐను సస్పెండ్ చేశారు. గుడివాడ కమిషనర్ సమగ్ర విచారణ సాగిస్తున్నారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

–పాయసం వెంకటేశ్వరరావు, కమిషనర్

లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తా



మాన్యువల్ రశీదులు జారీ, ఇంటి పన్నుల గోల్‌మాల్, మున్సిపాలిటీలో వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులు అందరిపైనా చర్యలు తీసుకోవాలి. విచారణ పేరుతో వాస్తవాలను రూపుమాపాలని చూసినా, పూర్తి స్థాయి చర్యలు లేకపోయినా లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తా.

–జంపాన శ్రీనివాసగౌడ్, సామాజిక కార్యకర్త

కొనసాగుతున్న రీలే దీక్షలు

ఉయ్యూరు: చార్ట్‌కౌన్సిలింగ్ ప్రక్రియ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో పదో రోజుకు చేరాయి. దీక్షలో జీఎస్ రావు, నాంచారయ్య పాల్గొన్నారు. అసోసియేషన్ జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, నాయకులు కుమార్, కిరణ్, లక్ష్మయ్య, బీవీరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అసోసియేషన్ ఉయ్యూరు డిపో ప్రతినిధులు పర్యవేక్షించారు.

మానవాళి ఆరోగ్యానికి సూర్యోపాసనసేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. మాఘ మాసం విశేష పర్వదినాలతో పాటు ప్రతి ఆదివారం ఆలయంలో సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నామని అర్చకులు పేర్కొన్నారు. సూర్య భగవానుడిని ఆరాధిస్తే సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తితో పాటు భక్తుల ఇంట ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఘనంగా ఉప్పలేటి ప్రసాదరావు శతజయంతి వేడుకలు



బండారుగూడెంలో ఉప్పలేటి ప్రసాదరావు, పుష్పారాగంకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, బండారుగూడెం మాజీ సర్పంచ్ ఉప్పలేటి ప్రసాదరావు శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బాపులపాడు మండలం బండారుగూడెంలోని ఉప్పలేటి ప్రసాదరావు, పుష్పరాగం దంపతుల విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బహుజన, దళిత, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కమ్యూనిస్టు భావజాలంతో శ్రమించిన ప్రసాదరావు పోరాటాలు మరువలేనివని అతిథులు కొనియాడారు. దాదాపు మూడు దశాబ్దాలు కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక మార్లు జైలు జీవితం, అజ్ఞాతవాసం గడిపిన ఉప్పలేటి తుదిశ్వాస వరకు ప్రజాసేవే లక్ష్యంగా గడిపారని చెప్పారు. సుదీర్ఘకాలం బండారుగూడెం సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని, గన్నవరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగానూ ఆయన పోటీ చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుమారులు ఉప్పలేటి నేతాజీ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి దేవిప్రసాద్, డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ తారకప్రసాద్, సుందర ప్రసాద్, కుమార్తెలు ఝాన్సీ, ఉదయకుమారి గ్రామంలోని పేదలకు పండ్లు, స్వీట్లు, స్టీల్ సామాగ్రిని పంపిణీ చేశారు. 1000 మందికి అన్నదానం చేశారు. బండారుగూడెం మాజీ సర్పంచ్ వడ్లమూడి తిరుపతిరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొరివి వినయ్‌కుమార్, దళిత సంఘాల నాయకులు భాగ్యారావు, పాలిమెట్ల జయరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గన్నవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నించాలని కోరారు. మెర్జ్ పేరుతో పాఠశాలలను తీసివేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంప్లెక్స్‌ల పేరుతో మూడవ శనివారాన్ని బోధన అభ్యసన ప్రక్రియకు ఉపాధ్యాయులను దూరం చేయొద్దని కోరారు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని, యాప్‌ల భారాన్ని తీసివేయాలని చెప్పారు. తక్షణమే పీఆర్సీ కమిటీలు వేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా సబ్‌స్టేషన్ మరమ్మతులను చేయనున్నారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తామని తెలిపారు. యనమలకుదురు ప్రధాన రహదారి, డొంక రోడ్డు, పెదపులిపాక గ్రామంలో శ్రీనగర్ కాలనీ, గణపతినగర్, ఎంవీఆర్ కాలనీ, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఘనంగా శిలా విగ్రహ ప్రతిష్ట

10 వేల మందికి అన్నసమారాధన



పెనమలూరులో ధ్వజస్తంభ ప్రతిష్ట చేస్తున్న దృశ్యం

పెనమలూరు: గ్రామంలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం శిలా విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో రెండు రోజులుగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మూడో రోజు ఉదయం 8 గంటలకు పవిత్ర గోపూజ, నవగ్రహ పూజ, విశేష హోమం చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీరామ సీత,లక్ష్మణ, ఆంజనేయ స్వామి, ద్వారపాలకులు విగ్రహ ప్రతిష్ట చేశారు. ధ్వజ స్తంభ ప్రతిష్ట జరిగింది. మహాపూర్ణాహుతి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం 10 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు.

మాజీ సర్పంచి రూ.లక్ష విరాళం

కోదండరామస్వామి దేవస్థానానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, పెనమలూరు మాజీ సర్పంచి కిలారు వెంకటేశ్వరరావు (బుడ్డి) రూ 1,01,116 విరాళం ఇచ్చారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఈ మేరకు సొమ్ము ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తెన్నేటి ప్రకాష్, చాగంటి వెంకటసాంబశివరావు, లింగాల ఆంజనేయులు, మరీదు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వ వరుస సర్వేలతో గ్రామ/వార్డ్ సచివాలయాల సిబ్బంది సతమతమవుతూ అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వలంటీర్లకు ఇచ్చినట్టే ప్రభుత్వమే సచివాలయాల ఉద్యోగులకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, తద్వారా సర్వేలు చేస్తే డేటా భద్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా ఒకేసారి పలు సర్వేలు చేయాలంటూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువాడం సరి కాదన్నారు. ఇటీవల కాలంలో డేటా చోరీలు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వమే ఫోన్, సిమ్ కార్డ్ అందించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలన సంస్కరణల్లో భాగంగా వివిధ సర్వేలకు సచివాలయ ఉద్యోగులను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు వారు వ్యతిరేకం కాకపోయినా ఎటువంటి శిక్షణ తరగతులు నిర్వహించకుండా పై అధికారుల ఆదేశాల మేరకు ఏక కాలంలో అన్ని సర్వేలు పూర్తి చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగుల వ్యక్తిగత ఫోన్లతో ప్రభుత్వ సర్వేలు, యాప్స్ ఇన్‌స్టాలేషన్‌తో వారి వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

శిథిలావస్థలో ఫిల్టర్‌బెడ్స్



నున్న ఫిల్టర్ బెడ్స్‌లో జమ్ము



ఫిల్టర్ బెడ్స్ రెండో బావిలో మురుగునీరు

నున్న(విజయవాడరూరల్): నున్నలోని ఫిల్టర్ బెడ్స్ శిథిలావస్థలో ఉన్నాయి. పంచాయతీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నున్నలో దాదాపు 25 సంవత్సరాల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించిన ఫిల్టర్ బెడ్స్(ఇసుక) నేడు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం మైక్రో ఫిల్టర్‌బెడ్స్ రన్నింగ్‌లో ఉండటంతో ఇసుక ఫిల్టర్‌బెడ్స్‌ను నిరుపయోగంగా ఉంచారు. వాటిలో జమ్ము దట్టంగా పెరిగి దర్శనమిస్తోంది. ఫిల్టర్ బెడ్స్‌లో ఉన్న నీరు రంగు మారి వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని వాకింగ్‌ట్రాక్‌పై నడిచే వారు అంటున్నారు. ఫిల్టర్ బెడ్స్ రెండో బావిలో మురుగునీరు ఉంది. గ్రామ పంచాయతీ పర్యవేక్షణ లేక పోవడంతో రాత్రి వేళల్లో మద్యం ప్రియులు అక్కడ మద్యం సేవించి ఖాళీ బాటిల్స్ అందులో వేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్స్ ను శుభ్రం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓటర్ల జాబితాలో గందరగోళం

- ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు
- పెనమలూరులో ఓట్లు 15,495
- 17 పోలింగ్ కేంద్రాలు



పోరంకిలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు

పెనమలూరు: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 15,495 మందికి ఓట్లు ఉన్నాయి. ఓటర్ల జాబితా గందరగోళంగా ఉండటంతో పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే కృష్ణా–గుంటూరు జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్నాయి. ఓటర్లు తమ ఓటు హక్కు ఉపయోగించుకోవడానికి అధికారులు 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కంకిపాడు జెడ్పీ పాఠశాలలో 3 పోలింగ్ కేంద్రాలు, పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 3 పోలింగ్ కేంద్రాలు, పోరంకి జిల్లా పరిషత్ పాఠశాలలో 8 పోలింగ్ కేంద్రాలు ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 3 పోలింగ్ కేంద్రాలు చొప్పున ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇప్పటికే అధికారులు ఓటర్ల జాబితా ప్రకటించారు. ఎన్నికల ప్రచార హడావుడి మాత్రం కానరావడం లేదు.

తప్పుల తడకపై ఫిర్యాదు

అధికారులు ప్రకటించిన ఓటర్ల జాబితా గందరగోళంగా మారింది. ఉదాహరణకు తాడిగడపకు చెందిన గురజాప్రకాష్‌రాజ్ పేరుతో 42 ఓట్లు గుర్తించారు. గురజా ప్రకాష్‌రాజ్ పేరుతో కలిపి ఇతరుల పేరుతో ఓట్లు ముద్రించి ఓటర్ల జాబితాలో ఉన్నాయి. డబుల్ ఎంట్రీ ఓట్లు దాదాపు 50కు పైగా గుర్తించారు. పెనమలూరు బూత్‌లో దుర్గామహేష్ 10వ తరగతి చదివినట్లు చూపారు. వామపక్ష నేతలు ఓటర్ల జాబితాలో తప్పుల తడకగా ఉందని అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిని తనిఖీ చేస్తున్నారు. ఓటర్ల జాబితాలో సాంకేతిక పరమైన లోపాలు ఉన్నాయని, దొంగ ఓట్లు లేవని అధికారులు తెలుపుతున్నారు.

సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



సోమేశ్వరాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట చేస్తున్న వేద పండితులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని శ్రీగంగా, బాలత్రిపుర సుందరి దేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణం, నవగ్రహ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. దాతలు నందూరు శ్రీరంగసాయి, లలితమ్మ దంపతులు, తాడిశెట్టి శ్రీహరి, నాగరూప దంపతుల కుటుంబ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. చిన్నాల సత్యగణేష్ బాబు, గరికపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

బెట్టింగ్ ఉచ్చులో యువత

- హనుమాన్‌జంక్షన్‌లో జోరుగా క్రికెట్ బెట్టింగ్
- యువతకు వ్యసనంగా మారుతున్న వైనం
- లోన్‌యాప్‌ల్లో రుణాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బెట్టింగ్ ఉచ్చులో హనుమాన్ జంక్షన్ పరిధిలోని యువత కూరుకుపోతున్నారు. క్రీడా మైదానంలో ఆటలు ఆడే రోజులు పోయాయి. ప్రస్తుతం ఇంటర్నెట్ యుగంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి రావడంతో యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడుతున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ గేమ్స్ కాస్త ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దారి తీస్తున్నాయి. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటం, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో విద్యార్థులు, యువత, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు ఈ బెట్టింగ్ యాప్‌లు, బుకీల వలలో చిక్కుకుంటున్నారు.

కుప్పలు తెప్పలుగా ..

ఆన్‌లైన్ బెట్టింగుల కోసం రకరకాల యాప్‌లు స్మార్ట్‌ఫోన్లలో విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. కొందరు ఈ బెట్టింగ్ యాప్‌లకు యువతను ఆకర్షించేందుకు బుకీలుగా వ్యవహరిస్తూ అమాయకులను ఉచ్చులోకి లాగుతున్నారు. తొలుత యాప్ ఇన్‌స్టాల్ చేసుకోగానే రూ.500 లేక రూ.1000 రివార్డుగా వస్తుందని యువతకు ఆశ చూపుతున్నారు. ఆ తర్వాత క్రికెట్ బెట్టింగ్ లేదా రమ్మీ పేకాటను ఆ రివార్డు నగదుతోనే ఆడుకోవచ్చని చెబుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యూజర్లు బాగా అలవాటు పడే వరకు కొంత మొత్తంలో నగదు గెలిచినట్లుగా యాప్ నిర్వహకులు ఎర వేస్తున్నారు. మొదట్లో బాగానే నగదు రావడంతో యూజర్లకు క్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ కట్టడం వ్యసనంగా మారుతోంది.

బెట్టింగ్ కోసం లోన్ యాప్‌లో రుణాలు..

బెట్టింగ్ బుకీలు ఆన్‌లైన్ లోన్ యాప్‌లను వీరికి పరిచయం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎలాంటి హామీ లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలోకి నగదు వచ్చేస్తుందని యువతను ప్రేరేపిస్తున్నారు. ఇంట్లో తెలియకుండా ఆన్‌లైన్ బెట్టింగులు కడుతున్న విద్యార్థులు, యువకులు లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆ తర్వాత అప్పు తీర్చినా ఇంకా బాకీ చెల్లించాలంటూ బెట్టింగ్ బుకీలు, లోన్ యాప్ ప్రతినిధులు ఫోన్ కాల్స్‌తో వేధింపులకు గురిచేయడంతో తల్లిదండ్రులకు చెప్పలేక, అప్పు తీర్చలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ క్రమంలోనే యువతకు గంజాయి కూడా బుకీల ద్వారా అందిస్తున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులే టార్గెట్‌గా ఒక్కో ప్యాకెట్ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

జంక్షన్‌లో తాజా ఉదంతాలు

ఆన్‌లైన్ బెట్టింగ్ బుకీల ఆగడాలు, గంజాయి సరఫరా హనుమాన్‌జంక్షన్‌లో ఇటీవల అధికమయ్యాయి. బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌ల ద్వారా మోసాలకు గురైన బాధితులు గత్యంతరం లేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యయత్నాలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గతంలో స్థానిక వేలేరు రోడ్డుకు చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌ల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గంజాయి మత్తులో తరచూ యువకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.

నేడు, రేపు గండిగుంటలో కబడ్డీ పోటీలు

ఉయ్యూరురూరల్: మండలంలోని గండిగుంట గ్రామంలో అంబేడ్కర్ కబడ్డీ లీగ్ 2025 పోటీలు ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మాజీ ఎంపీటీసీ గుండె పోతురాజు తెలిపారు. గండిగుంట గ్రామ పెద్దల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడి ముక్కల, కంకిపాడు మండలాల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు టీం తరఫున ఆధార్ కార్డులతో హాజరుకావాలని తెలిపారు.